క్లుప్తంగా

స్పీకర్ తమ్మినేని సీతారాంను కలుసుకున్న ఎమ్మెల్యే



స్పీకర్ తమ్మినేని సీతారాంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం స్పీకర్ చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం స్పీకర్ తమ్మినేని సీతారాం పుట్టినరోజు కావడంతో ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి దుశ్శాలువాతో సత్కరించారు.

చంద్రశేఖరస్వామికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో చంద్రశేఖరస్వామి

రంగంపేట: మండలంలోని చంద్రేడులో కొలువైయున్న శ్రీకాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామివారికి గురువారం మాసశివ రాత్రి సందర్భంగా ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



ఉమా రామలింగేశ్వర స్వామివారు

సీతానగరం: మాసశివరాత్రి సందర్భంగా సీతానగరం శివాలయంలోని ఉమా రామలింగేశ్వరస్వామికి గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన జరిపారు. అర్చకులు కొడమంచిలి శ్యామల రావు గురుస్వామి, రాముస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

సాయిబాబా మాలధారణ



బలభద్రపురంలో మాలధారణ చేసిన సాయిబాబా భక్తులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో కొలువైన శ్రీఆంధ్రా షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం పెద్దఎత్తున భక్తులు మాలధారణ చేశారు. ఈ సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భక్తుల కోసం అన్నసమారాధన చేశారు. ఈ నెల 17వ తేదీన ఆలయ వార్షికోత్సవంలో భాగంగా భక్తులు మాలధారణ చేసినట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి తెలిపారు.

విస్తృతంగా సెబ్ దాడులు



తిరుమలాయపాలెంలో సారా, నిందితులతో సెబ్ బృందం

మధురపూడి: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బంగారు రాజు ఆధ్వర్యంలో విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. కొన్ని రోజులుగా సారా బట్టీలపై దాడులు నిర్వహించి 300 లీటర్ల సారా సీజ్ చేశామని, 2 వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని సీఐ బంగారు రాజు తెలిపారు. అలాగే బెల్టు షాపులపై దాడులు నిర్వహించి 100 లీటర్ల మద్యం (బాటిళ్లు) స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. 20 మందిపై కేసులు నమోదు చేశామన్నారు.

భోజనం ప్యాకెట్ల వితరణ



మహిళకు భోజనం అందిస్తున్న దాత

సీతానగరం: చినకొండేపూడిలోని షిరిడీ సాయి బాబా వసతి మందిరం ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. దాతలు జల్లు వీరభద్రరావు, జల్లు సత్యనారాయణ సహకారంతో 150 మంది నిరుపేదల ఇళ్లకు వెళ్లి సేవా సమితి సభ్యులు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు.

అన్నదాతకు నష్టం

పొలంలో మూషికం..

- పంటను నాశనం చేస్తున్న ఎలుకలు
- ఆందోళనలో రైతులు
- నివారణ మందు పంపిణీ చేసిన ప్రభుత్వం
- వాడే విధానంపై అవగాహన



పొలాల్లో ఎలుకలను పట్టుకునేందుకు వేసే బుట్టలు



బ్రోమోడయోలిన్ ఎర తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రాజానగరం: దుక్కి దున్ని, నారు పోసి, నాట్లు నాటి, పంట ఏపుగా పెరిగేందుకు అవసరమైన ఎరువులు వేసి, పురుగుల నివారణా మందులను స్ప్రే చేసి, పంట పండి చేతికొచ్చే వరకూ అన్నదాతల కష్టం వర్ణనాతీతంగా ఉంటుంది. ఈ విధంగా ఆరుగాలం శ్రమించి పంటలు పండించే సమయంలో ఎలుకలు చొరబడి దిగుబడిని నాశనం చేస్తూ కర్షకులకు కుదురు లేకుండా చేస్తున్నాయి. ఈ సమయంలో రైతులు అనుసరించాల్సిన చర్యలపై వ్యవసాయాధికారులు అవగాహన కలిగిస్తున్నారు. ఎలుకల నివారణకు మందు అందజేసి, సామూహిక ఎలుకల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

22,500 ఎకరాల్లో రబీసాగు

రాజానగరం, రంగంపేట, గండేపల్లి, కోరుకొండ, రాజమహేంద్రవరం రూరల్ మండలాలలో 22,500 ఎకరాలలో రబీ వరి సాగు జరుగుతోంది. దానిలో 11,850 ఎకరాలు పొట్ట, ఈనిక వేసే దశల్లో ఉండగా, మిగిలిన 10,650 ఎకరాలు చిరుపొట్ట దశలో ఉన్నాయి. ఈ సమయంలో ఆయా పంటలను ఎలుకలు ఆశించి, నాశనం చేసేందుకు ఎక్కువ అవకాశాలుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమయంలో ఎలుకల సంతానోత్పత్తి కూడా ఎక్కువగా ఉంటోంది. దీనితో బ్రోమోడయోలిన్ మందుతో ఎరను తయారు చేసి, బొరియలలో వేసి ఎలుకల నివారణపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. అయితే రైతులు తీసుకునే ప్రతి చర్యను గమనించే ఎలుకలు ఈ ఎరలను వెంటనే ముట్టుకోవడం లేదని కొంతమంది రైతులు అంటున్నారు. ఈ కారణంగా బుట్టలు కూడా వేయిస్తున్నామంటున్నారు.

బుట్టలు వేయిస్తే ఎలుకకు రూ.125 ఖర్చు

వ్యవసాయాధికారులు సూచించిన విధంగా బ్రోమోడైయాలిన్ ఎరతో పెద్దగా ఫలితం కనిపించని రైతులు పొలాలలో ఎలుకలు పట్టేందుకు బుట్టలు వేయిస్తున్నారు. సాధారణంగా ఎలుకల వలన పంట దిగుబడిలో 25 శాతం వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉంటుంది. దీనితో రైతులు ఖర్చుకు కూడా వెనకాడకుండా మందుతో పాటు బుట్టలు కూడా పెట్టిస్తున్నారు. ఈ విధంగా బుట్టల ద్వారా ఎలుకలను పడితే బుట్టలు వేసిన వ్యక్తికి ఒక్కో ఎలుకను రూ. 125 చెల్లించాల్సి ఉంటుంది.

సామూహికంగా చేపట్టాలి

వరి పంటను నాశనం చేసే ఎలుకలను నివారించాలనే తలంపుతో చాలామంది రైతులు ఎవరికి వారే పొలాలలో బ్రోమోడైయాలిన్‌తో తయారు చేసిన ఎరను ఉపయోగిస్తున్నారు. దీనివల్ల ఒక పొలంలో మందు పెడితే మరొక పొలంలో ఎలుకలు తలదాచుకుంటున్నాయి. దీనితో వాటిని పూర్తి స్థాయిలో అరికట్టలేకపోతున్నారు. రైతులందరూ ఒకే రోజు సామూహికంగా నివారణా చర్యలు చేపడితే ఎలుకలను దాదాపుగా నివారించవచ్చు.

– ఎస్‌కే ఇమామి ఖాసిమ్, మండల వ్యవసాయాధికారి, రాజానగరం

అదనపు ఖర్చు



వ్యవసాయంలో యాంత్రీకరణ వచ్చినా గానీ ఖర్చులు ఏమాత్రం తగ్గడం లేదు. ముఖ్యంగా ఎలుకల నివారణకు బుట్టలు వేయించి, ఎలుకలను పట్టించేందుకు ఎకరానికి రూ.ఐదు వేలకు పైనే ఖర్చు అవుతోంది. బుట్టలు వేసిన వ్యక్తికి ఒక్కో ఎలుకకు రూ.125 ఇవ్వాల్సి వస్తోంది. దిగుబడిని కాపాడుకోవడం కోసం ఈ ఖర్చులకు వెనకంజ వేయలేకపోతున్నాం.

– పి. రామకృష్ణ, రైతు, సంపత్ నగరం

సమాజ హితంగా జీవన విధానం



బీసీడీఈ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రాజానగరం: విద్యార్థులు చదువుతో పాటు సమాజం విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమాజ హితంగా జీవన విధానం అలవర్చుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ థ్రో ఎడ్యుకేషన్ (బీసీడీఈ) అనే అంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువతను ప్రభుత్వంలో భాగస్వాములను చేసి, సమాజహితమైన కార్యక్రమాలను నిర్వహించడమే ప్రధాన లక్ష్యంగా బీసీడీఈ పనిచేస్తుందన్నారు. ఇటీవల ఉన్నత విద్యలో ప్రవేశపెట్టిన కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టుకు అవసరమైన వనరులను, అంశాలను విద్యార్థి లోకానికి పరిచయం చేయడానికి, అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. బీసీడీఈ సెక్రటరీ, సీఈఓ ఆచార్య ఎంఎల్ఎస్ దేవకుమార్, కన్సల్టెంట్ కె.సిమ్రాన్ మాట్లాడారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, యూనివర్సిటీతో పాటు అనుబంధ కళాశాలలకు చెందిన బీసీడీఈ ప్రతినిధులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగంగా చేపట్టాలి



పెదపూడిలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆశాజ్యోతి

పెదపూడి: పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఇళ్ల పట్టాలకు సంబంధించి సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగంగా చేపట్టాలని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి తెలిపారు. గురువారం పెదపూడి, వేంద్ర, కాండ్రేగుల తదితర గ్రామాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాల్లో సుమారు 4,950 ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా ఇప్పటివరకూ దాదాపు 1,500 పట్టాల రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్లను చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ చలమయ్య, వీఆర్వోలు సుబ్రహ్మణ్యం, హరిచంద్రప్రసాద్, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, లక్ష్మీ నారాయణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన త్రయాహ్నిక లక్ష రుద్రాక్షాభిషేక పూజలు



కొంకుదురులో వస్త్ర దానం చేస్తున్న కర్తలు మల్లిడి శ్రీనివాసరెడ్డి, రేణుకా పద్మ దంపతులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడితల మామిడి వద్ద ఉన్న శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న త్రయాహ్నిక లక్ష రుద్రాక్షాభిషేక పూజలు గురువారంతో ముగిశాయి. అర్చకులు రమణశర్మ ఆధ్వర్యంలో మల్లిడి శ్రీనివాసరెడ్డి, రేణుకాపద్మ దంపతులు కర్తగా వ్యవహరించారు. పూజల్లో భాగంగా గోదానం, వస్త్ర దానం, భూదానం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, ఎంపీటీసీ కొంకుదురు పీపీ, మల్లిడి కోదండం బ్రదర్స్, చిన్నం శ్రీనివాసరెడ్డి, మల్లిడి సురేష్ కుమార్‌రెడ్డి, మల్లిడి మోహర్ కుమార్‌రెడ్డి, సత్తి అమ్మిరెడ్డి, బాబి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో రమేష్‌కు సన్మానం



ఎంపీడీవో రమేష్ దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

సీతానగరం: ఇటీవల గోపాలపురం మండలానికి బదిలీ అయిన స్థానిక ఎంపీడీవో కె.రమేష్‌ను గురువారం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, ఏపీవో నాగశేషవేణి, ఏవో గోపాల్, సీనియర్ అసిస్టెంట్ డి.విజయ్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ భరణి కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ సతీష్ తదితరులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు విజయలక్ష్మి పరామర్శ



మధురపూడిలో బాధితులను పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: నియోజకవర్గంలోని పలు బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి గురువారం పరామర్శించారు. కోరుకొండ మండలం మధురపూడికి చెందిన కుప్పాల శ్రీను, మేర్ల గంగారత్నం, దాసి సుజీ కుమారి ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా వారి కుటుంబాలను విజయలక్ష్మి పరామర్శించారు. రాజానగరం మండలం వెలుగుబందకు చెందిన కోలాటి సుబ్బారావు ఇటీవల ప్రమాదవశాత్తూ గాయాలపాలై చికిత్స పొందారు. ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. విజయలక్ష్మి వెంట మండలం కో కన్వీనర్ గణేశుల పోసయ్య, పార్టీ నాయకులు బత్తిన త్రిమూర్తులు, ఇండిగమెల్లి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వారి నిజాయితీ అభినందనీయం



మాజీ మేనేజర్ లక్ష్మీతులసిని అభినందిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కోళ్లబాబు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రూ.5 లక్షల విలువైన బంగారు వస్తువులను ఖాతాదారుడికి అప్పగించిన డీసీసీబీ బ్రాంచి మేనేజర్, స్వీపర్ నిజాయితీ వెలకట్టలేనిదని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. గురువారం స్థానిక శ్యామలా సెంటర్‌లోని డీసీసీబీ బ్రాంచి కార్యాలయంలో డీసీసీబీ మాజీ మేనేజర్ జి.లక్ష్మీ తులసి, స్వీపర్ మొండి సత్యవతిని ఆకుల వీర్రాజు, ఇన్నీసుపేట కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు (బాబు), డైరెక్టర్ల సమక్షంలో సత్కరించారు. ఆకుల వీర్రాజు మాట్లాడుతూ రాజమహేంద్రవరం డీసీసీబీ బ్రాంచిలో లాకర్ రూమ్‌ను 2023 అక్టోబర్ ఏడున స్వీపర్ మొండి సత్యవతి శుభ్రం చేస్తుండగా, రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాల ప్యాకెట్ దొరికిందన్నారు. ఆమె ఆ ప్యాకెట్‌ను నిజాయితీగా అప్పటి మేనేజర్ జి.లక్ష్మీతులసికి అందజేసిందన్నారు. ఆమె ఎంతో బాధ్యతగా వాటిని పోగొట్టుకున్న ఖాతాదారుడికి అందించిందన్నారు. కార్యక్రమంలో ఇన్నీసుపేట కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్లు, డీసీసీబీ బ్రాంచి మేనేజర్ పాల్గొన్నారు.

కాళహస్తీశ్వర సిద్ధాంతికి సత్కారం

కడియం: దుళ్ల గ్రామానికి చెందిన వాస్తు సిద్ధాంతి దొంతంశెట్టి కాళహస్తీశ్వరరావుకు స్వర్ణసింహ తలాట సత్కారం జరిగింది. ఇటీవల చీరలలోని సాయిబాబా కల్యాణ మండపంలో దేవబ్రాహ్మణ (దేవాంగ) అర్చక, పురోహిత, పండిత్ తృతీయ సర్వసభ్య సమావేశం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్రబాబు, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఆనంద ప్రసాద్, రాష్ట్ర దేవాంగ సంఘం ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ తదితరులు హాజరయ్యారు. కాళహస్తీశ్వర సిద్ధాంతి ఆధ్యాత్మిక, సాంస్కృతిక సేవలకు గాను స్వర్ణసింహ తలాట సత్కారం చేశారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

రాజానగరం: స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆస్పత్రిలోని చరకా ఆడిటోరియంలో ఎన్నికల సిబ్బందికి గురువారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. రాజానగరం నియోజకవర్గ ఎన్నికల అధికారి, రాజమహేంద్రవరం ఆర్డీఓ ఏ.చైత్రవర్షిణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రాబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తించడంతో పాటు, అరాచక శక్తులను అరికట్టడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలకు చెందిన సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు, బూత్ లెవెల్, సెక్టోరల్, పోలీస్ సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

మండల ఎస్టీయూ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ

బిక్కవోలు: మండలంలోని రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం(ఎస్టీయూ) అధ్యక్షుడిగా నాగసూరి లక్ష్మీనారాయణ ఎంపిక చేసినట్లు ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మణ్ తెలిపారు. గురువారం బిక్కవోలు ప్రాథమిక మెయిన్ పాఠశాల వద్ద ఎస్టీయూ మండల శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ నూతన కమిటీ సంఘ ఉన్నతి కోసం పోరాటం చేయాలన్నారు. ఎస్టీయూ ప్రధాన కార్యదర్శిగా ద్వారంపూడి సురేంద్రకుమార్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా బండారు దుర్గారావులను ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జాకబ్, జిల్లా అధ్యక్షుడు జె.డేనియల్‌బాబు, రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ తమలంపూడి ఈశ్వర రెడ్డి, వెలగల భామిరెడ్డి, లచ్చిరెడ్డి, కె.పోలిరామారెడ్డి, అప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలి

పెదపూడి: రైతులు వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని ఏఓ టీవీఆర్ మణిదీప్ అన్నారు. పెదపూడి, దోమాడ గ్రామాల్లో రైతులకు వాతావరణ దృష్ట్యా పొలాలకు ఆశించే తెగుళ్లు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం పొలాల్లో ఎండు, మాగుడు, పొడ తెగులు కనిపిస్తున్నాయన్నారు. విచక్షణారహితంగా వాడే ఎరువులు, పురుగు మందులతో వరికి తెగుళ్ల వ్యాపిస్తున్నాయన్నారు. తెగుళ్ల నివారణకు వేప నూనె, పశువుల మూత్రం, పేడ వాడాలని సూచించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రంగంపేట: జి.దొంతమూరు సబ్‌స్టేషన్లలో వార్షిక మరమ్మతులు, విద్యుత్తు లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని దొంతమూరు, వీరంపాలెం, వీరంపాలెం పాకలు, బాలవరం గ్రామాలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్తు ఉండదన్నారు.

ముస్లింల సంక్షేమానికి సీఎం జగన్ కృషి



డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆరిఫ్ తదితరులు

సీటీఆర్ఐ: ముస్లింల సర్వతోముఖాభివృద్ధికి జగనన్న ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాజమహేంద్రవరం పార్లమెంట్ సమన్వయకర్త డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. వక్ఫ్ బోర్డ్ జిల్లా చైర్మన్ మహమ్మద్ ఆరిఫ్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్లు గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ముస్లిం సంప్రదాయ పద్ధతిలో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ముస్లింలందరూ వైఎస్సార్ సీపీ వెంటే..

డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ముస్లింల సంక్షేమం కోసం సీఎం జగన్ పని చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడి అబద్ధాలను, కుట్రలను సమర్థంగా తిప్పి కొట్టాలని, ముస్లింలందరూ వైఎస్సార్ సీపీ వెంట నడిచేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్లు మహమ్మద్ జఫరుల్లా ఖాన్, షేక్ ఇబ్రహీం, షేక్ అహ్మద్, షబ్బర్ బాషా పాల్గొన్నారు.

భలే ‘మంచు’రోజు



ఆర్ట్స్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మంచు పరదా



సెంట్రల్ జైలు సమీపంలో కానరాని రోడ్డు



ఆర్ట్స్ కళాశాల మెయిన్ గేట్ వద్ద కమ్ముకున్న మంచు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): శీతాకాలంలో వేకువజామున మంచు కురవడం సహజమే. దానికి భిన్నంగా గురువారం ఉదయం 7.30 ప్రాంతంలో పొగమంచు నగరాన్ని కమ్మేసింది. రోడ్డుపై వెళ్లే వాహనాలు కానీ, మనుషులు కానీ కనిపించని పరిస్థితి ఏర్పడింది. సెంట్రల్ జైలు రోడ్డులో దారి కనబడకపోవడంతో వాహనాలను కొద్దిసేపు ఆపేశారు. పొగమంచు తగ్గిన తర్వాత ముందుకు సాగారు. దేవీచౌక్, కంబాలచెరువు ప్రాంతాల్లో మంచు తీవ్రత అధికంగా ఉంది.

రెవెన్యూ అధికారులతో సమావేశం



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు: వచ్చే నెల తొమ్మిదో తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌పై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రెవెన్యూ, పంచాయతీ అధికారులతో ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత గురువారం సమావేశమయ్యారు. జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాల్సిన కేసులను గుర్తించి న్యాయసేవాధికార సంస్థకు అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌తో పరిష్కారం పొందిన కేసులు కోర్టు ఫీజు చెల్లించనవసరం లేదని తెలిపారు. అధిక కేసులు పరిష్కరించేందుకు అందరూ సహకారం అందజేయాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ న్యాయవాది సీహెచ్‌వీ ప్రసాద్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ సీపీఆర్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.